

నకిలీ బంగారంతో బురిడీ

నకిలీ బంగారంతో బురిడీ కొట్టిస్తున్న ఓ ముఠా గుట్టు రట్టయింది. గుంతకల్లు పోలీసులు 9 మందిని అరెస్టు చేశారు. 8లో



టన్ను చీనీ రూ.18 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు, కనిష్టం రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.

గరిష్టం/కనిష్టం

35.4°/23.6°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

హింసాత్మకంగా బాబు పాలన



మాట్లాడుతున్న మాజీ మంత్రి శైలజానాథ్

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో చంద్రబాబు పాలన హింసాత్మకంగా సాగుతోందని వైఎస్సార్ సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ మంత్రి శైలజానాథ్ ధ్వజమెత్తారు. గురువారం మండల కేంద్రం లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శైలజానాథ్ మాట్లాడారు. బీకేఎస్ మండలంలోని చెన్నంపల్లిలో తమ పార్టీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు దాడులకు పాల్పడడం పిరికిపంద చర్య అన్నారు. 8 మందిపై కొడవళ్లు, గొడ్డళ్లతో దాడులకు పాల్పడడం దారుణమని, వైఎస్సార్ సీపీ పాలనలో మండలంలో ఎక్కడా దాడుల ఘటనలు జరగలేదన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలోనూ హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోలేదన్నారు. నేడు ప్రశాంతంగా ఉండే పల్లెల్లో టీడీపీ నాయకులు ఘర్షణ వాతావరణం సృష్టిస్తున్నారని విమర్శించారు. అధికార యంత్రాంగం రాజకీయాలకు అతీతంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు, సర్పంచ్ పార్వతి, పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, నరేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

అనంతపురం అర్బన్: 'సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. వివిధ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.



అనంతపురంలో ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు



అనంతపురంలోని వేమనా టెలిఫోన్ భవన్ వద్ద ఉన్న మందిరంలో స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

సాయిా శరణం..

జిల్లా వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. సాయిబాబా ఆలయాలకు గురువారం భక్తులు పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. అన్న ప్రసాదం స్వీకరించారు. వేడుకలను పురస్కరించుకుని మందిరాల్లో సాయినాథునికి ప్రత్యేక పూజలు జరిగాయి. విద్యుద్దీప కాంతుల నడుమ ఆలయాలు కొత్త శోభను సంతరించుకున్నాయి.

– సాక్షి బృందం

రంగయ్య పర్యటనకు పోలీసుల అడ్డంకులు



రంగయ్య, ఉమాను అడ్డుకుంటున్న రూరల్ సీఐ వంశీకృష్ణ

కళ్యాణదుర్గం: చంద్రబాబు కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను వివరించేందుకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య శెట్టూరులో ఏర్పాటు చేసిన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. గురువారం ఉదయం రంగయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమా మహేశ్వర నాయుడులు పార్టీ శ్రేణులతో కలిసి కళ్యాణదుర్గం నుంచి శెట్టూరుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే అప్పటికే ఎమ్మెల్యే ఆదేశాలతో సిద్ధంగా ఉన్న పోలీసులు వైఎస్సార్ సీపీ కార్యాలయానికి చేరుకుని రంగయ్యను హౌస్ అరెస్టు చేసేందుకు యత్నించారు. తాను ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే వెళ్తున్నానని రంగయ్య పోలీసులకు సమాధానమిచ్చారు. ఎమ్మెల్యే అమిలినేని కార్యక్రమం ఉందని బుకాయిస్తూ అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే శెట్టూరుకు వెళ్లేందుకు బయలుదేరుతుండగా రూరల్ సీఐ వంశీకృష్ణ తన సిబ్బందితో రంగయ్య వాహనాలను అడ్డుకున్నారు. పోలీసుల అత్యుత్సాహం సర్వత్రా విమర్శలకు తావిచ్చింది.

హద్దుల్లేని ఇసుక దందా

హగరి.. హరీ

- డీ హీరేహాళ్ మండలం నుంచి రోజూ వందల టిప్పర్లు కర్ణాటకకు
- రూ. కోట్లు కొల్లగొడుతున్న టీడీపీ నేతలు
- మైనింగ్ అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడంతో ఇష్టారాజ్యం





డీ హీరేహాళ్ మండలం బాదనహాళ్ వద్ద ఇసుక నిల్వలు, (ఇన్‌సెట్‌లో) కాదలూరు సమీపంలో ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఇసుక మాఫియాకు రాయదుర్గం నియోజకవర్గం అడ్డాగా మారింది.ఎలాంటి దొంగ సరుకైనా సరే సరిహద్దు ఆవలకు వెళితే ఇక అడిగేవారుండరు. దీన్ని ఆసరాగా చేసుకుని రోజూ వందలాది టిప్పర్ల ఇసుక, మట్టి కర్ణాటకకు తరలిస్తున్నారు. ఏపీలో లభ్యమయ్యే ఇసుక నాణ్యతగా ఉండడంతో కర్ణాటకలో భారీ డిమాండ్ ఉంటుంది. దీంతో హగరి నదిలో 15 మీటర్ల వరకూ తవ్వి ప్రొక్లెన్ల ద్వారా టిప్పర్లలో ఎత్తి పంపిస్తున్నారు.

టీడీపీ నేతల పాత్ర..

ఇసుక దందాలో టీడీపీకి చెందిన ముఖ్య నేతలు కీలక పాత్ర పోషిస్తున్నట్టు తెలుస్తోంది. నేతల హస్తం లేకుండా రోజుకు 200కు పైగా టిప్పర్లు వెళ్లలేవు. దందాలో వచ్చే సొమ్ములో స్థానిక నేతలు, ముఖ్య నేతలు 50:50 పద్ధతిలో పంచుకుంటున్నట్టు తెలుస్తోంది. రాత్రింబవళ్లు టిప్పర్ల జాతరను తలపిస్తున్నా అడిగేవారు కరువయ్యారు. స్థానిక నేతల భయానికి గ్రామస్తులు కూడా ఏమీ మాట్లాడలేని పరిస్థితి నెలకొంది.

మొలకల్మూరు కేంద్రంగా అక్రమాలు..

ఏపీ నుంచి వెళ్లే ఇసుకను కర్ణాటకలోని మొలకల్మూరు నియోజకవర్గంలో నిల్వ చేస్తున్నారు. డి.హీరేహాళ్ మండలంలోని కాదలూరు, బాదనహాళ్ నుంచి ఇసుక తీసుకుని మొలకల్మూరులో డంప్ చేస్తున్నారు. బాదనహాళ్ నుంచి 200 మీటర్ల లోపే ఏపీ బార్డర్ ముగుస్తుంది. మొలకల్మూరులోకి ఇసుక వెళ్లిందంటే ఇక ఏపీ పోలీసులు ఏమీ అనలేరు. అక్కడ నుంచి బళ్లారి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక టిప్పర్ ఇసుక ధర ఏపీలో రూ.20 వేలు ఉంటే కర్ణాటకలో రూ.70 వేల వరకూ అమ్ముతున్నారు. ఏడాదిగా వేదవతి హగరి నదుల్లో ఇసుకను తోడేళ్లలా తవ్వేస్తున్నా అడిగే నాథుడే లేరు. టీడీపీ నేతలకు ఇసుక వ్యాపారమే ప్రధాన ఆదాయ వనరుగా మారిందని స్థానికులు చెప్పుకుంటున్నారు.

కర్ణాటక పోలీసుల దాడులు

విచిత్రమేమంటే ఏపీ నుంచి తరలిపోయే ఇసుక టిప్పర్లను మన పోలీసులు పట్టుకోవడం లేదు. అయితే, కర్ణాటకలో ఇసుక రీచ్‌ల లైసెన్సులు తీసుకున్న వారు అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఏపీ–కర్ణాటక సరిహద్దులో ఇసుక లారీలను పట్టుకున్నారు. కొన్నింటిపై కేసులు నమోదు చేసినట్టు తెలిసింది. ఏపీ నుంచి వచ్చే ఇసుకను నియంత్రించాలంటూ ఇక్కడి పోలీసులను కర్ణాటక పోలీసులు కోరినట్టు తెలిసింది. దీంతో రాయదుర్గం పోలీసుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. ఇసుక దందాను నియంత్రిస్తే 'పచ్చ' నేతలకు కోపం.. మరోవైపు కర్ణాటక పోలీసుల ఒత్తిడి.. మధ్యలో ఏం చేయాలో తోచక తీవ్ర ఆలోచనలో పడినట్లు తెలిసింది.

మెగా.. మొక్కుబడిగా..

- గ్రామీణ ప్రాంతాల్లో ఆసక్తి చూపని తల్లిదండ్రులు
- ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేసేందుకే ప్రాధాన్యత



ఉరవకొండలో విద్యార్థులకు మొక్కలు అందిస్తున్న మంత్రి కేశవ్, కలెక్టర్ వినోద్‌కుమార్



కూడేరు: సభావేదిక వెనుక భాగాన యూనిఫాం క్లాత్‌తో పరదా ఏర్పాటు చేసిన దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లకు జిల్లాలో స్పందన కరువైంది. వారం రోజులుగా కలెక్టర్ మొదలు విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు తీవ్రస్థాయిలో కసరత్తు చేశారు. డీవైఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంల మెడపై కత్తిపెట్టి ఒత్తిళ్లు చేశారు. ఇంతచేసినా తల్లిదండ్రుల నుంచి స్పందన తూతూమంత్రంగానే వచ్చింది. గురుపౌర్ణమి కావడం, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువమంది రైతులు, కూలీ చేసుకునే వారు ఉండడంతో పనులు మానుకుని వచ్చేందుకు తల్లిదండ్రులకు ఆసక్తి చూపలేదు. చాలా ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లోనూ ఫొటోలు తీయించి మమ అనిపించారు.

ఫొటోల అప్‌లోడ్‌పైనే ఆసక్తి

కొన్ని ప్రభుత్వ స్కూళ్లలో ఫొటోల కోసం తల్లిదండ్రులను బలవంతంగా పిలిపించి వివిధ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల అభివృద్ధి, పురోగతిపై చర్చ కంటే కూడా కార్యక్రమం నిర్వహించామా...ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేశామా.. పని అయిపోయిందా అనే విధంగా జరిగాయి. ప్రభుత్వ ప్రచారం కోసం తప్ప విద్యార్థులకు ఏమాత్రం ఉపయోగం లేదంటూ తల్లిదండ్రులు నిట్టూర్చారు. 'నాడు–నేడు' పనులు నిలిచి ఎక్కడికక్కడ ఆగిపోయిన తరగతి గదుల గురించి కనీసం పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. 'మెగా పీటీఎం' నిర్వహణకు ప్రభుత్వం చాలీచాలని నిధులు కేటాయించడంతో అవి సరిపోక తమ జేబు నుంచి పెట్టుకోవాల్సి వచ్చిందని పలువురు హెచ్‌ఎంలు వాపోయారు.

2,395 స్కూళ్లల్లో మెగా పీటీఎంలు

జిల్లా వ్యాప్తంగా 2,395 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పండుగ వాతావరణంలో మెగా పీటీఎం వేడుకలు జరిగాయని డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్ర శిక్ష ఏపీసీ టి.శైలజ తెలిపారు. తొలుత తరగతుల వారీగా ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారన్నారు. ప్రజా ప్రతినిధులు ఆయా మండలాల్లోని పాఠశాలల్లో మెగా పీటీఎంలకు హాజరయ్యారన్నారు. మెగా పీటీఎంల నిర్వహణలో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు.

అత్యుత్సాహం.. అయోమయం

తాడిపత్రి మండలం సజ్జలదిన్నె జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పీటీఎంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అనుచరుల అత్యుత్సాహంతో అయోమయం నెలకొంది. ఎంపీ వెంట తాడిపత్రికి చెందిన టీడీపీ నాయకుడు రామాంజినేయులు, బుల్లెట్ లింగమయ్య వచ్చారు. రామాంజి సభావేదికపై ఆశీనులు కాగానే లింగమయ్య రాజకీయ ప్రసంగం చేస్తూ 'జై వాల్మీకి' అంటూ నినాదాలు చేయడంతో అక్కడికి వచ్చిన వారంతా అవాక్కయ్యారు. పాఠశాలలో కుల రాజకీయాలు ఏంటంటూ విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు.

- పిల్లలకు యూనిఫాం క్లాత్ ఇవ్వకుండా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు దాచి పెద్ద సైజులో పరదా కుట్టించడం విమర్శలకు తావిచ్చింది. కూడేరులోని హైస్కూల్‌లో మెగా పేరెంట్స్ మీటింగ్ సందర్భంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తమ పిల్లలకు యూనిఫాం క్లాత్ ఇవ్వకుండా పరదా తయారు చేశారా అంటూ పలువురు తల్లిదండ్రులు చర్చించుకోవడం కనిపించింది.

సత్ప్రవర్తనతో మెలగాలి

ఉరవకొండ: విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలిగి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పిలుపు నిచ్చారు. గురువారం ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మెగా పీటీఎం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కేశవ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ విద్యావ్యవస్థను గాడిన పెట్టి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నారన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నామన్నారు.

జోరుగా 'ఆశల పరవళ్లు'..



తుంగభద్ర ఎగువ కాలువలో పారుతున్న జలాలు

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నుంచి ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కు గురువారం బోర్డు అధికారులు నీటిని విడుదల చేశారు. తుంగభద్ర బోర్డు సెక్రటరీ రామకృష్ణారెడ్డి, డ్యాం ఎస్ఈ నారాయణ నాయక్, హెచ్చెల్సీ ఈఈ చంద్రశేఖర్ డ్యాం వద్ద స్విచ్ ఆన్ చేసి నీటి విడుదలను లాంఛనంగా ప్రారంభించారు. అంతకు ముందు బోర్డు అధికారులు డ్యాంపై పూజలు చేశారు. సంప్రదాయబద్ధంగా వాయనం వదిలారు. ఈ సందర్భంగా బోర్డు సెక్రటరీ రామకృష్ణా రెడ్డి, డ్యాం ఎస్ఈ నారాయణ నాయక్ మాట్లాడుతూ తుంగభద్ర ఎగువ కాలువకు తొలుత 100 క్యూసెక్కుల నీరు వదిలి తరువాత ప్రతి రెండు గంటలకోసారి నీటి విడుదలను పెంచుతామని తెలిపారు. మొత్తంగా 500 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రా, కర్ణాటక కోటా కలిపి నీరు విడుదల చేస్తున్నామన్నారు. ఖరీఫ్‌లో పంటల సాగుకు ఈ నెల 10 నుంచి నవంబర్ 30 వరకూ దాదాపు 1,300 క్యూసెక్కులు వదులుతామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జూలై మొదటి వారంలోనే డ్యాం నుంచి నదికి నీటిని విడుదల చేశామన్నారు. డ్యాం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 100 టీఎంసీలు కాగా ఇటీవల 80 టీఎంసీలకు కుదించామన్నారు. 12వ తేదీ సాయంత్రం 6 గంటలకల్లా ఆంధ్రా సరిహద్దుకు తుంగభద్ర జలాలు చేరుతాయని అధికారులు తెలిపారు.

విషయాలు తెలియవంట..

గతంలో హెచ్చెల్సీకి నీరు విడుదలయ్యే సమయంలో స్థానిక అధికారుల్లో హడావుడి ఉండేది. ఎక్కడైనా కాలువలు దెబ్బతిన్నాయా అని పరిశీలించడంతో పాటు నీటి వినియోగంపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేవారు. ఈసారి మాత్రం ఆ పరిస్థితులే కనిపించడం లేదు. ఇన్‌చార్జ్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి తనకేమీ పట్టనట్లు ఉన్నారు. గురువారం నీటి విడుదలపై ఆయనను వివరణ కోరగా... హెచ్చెల్సీకి నీటిని విడుదల చేసినట్లు ఉన్నారని, మిగిలిన విషయాలు తనకు తెలియవని, బోర్డు అధికారులతో మాట్లాడి కనుక్కోమని చెప్పారు. దీన్ని బట్టి చూస్తే హెచ్చెల్సీ అధికారుల నిర్లక్ష్య వైఖరి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

క్లుప్తంగా

యువతి మిస్సింగ్ కేసులో వీడిన మిస్టరీ

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన యువతి మిస్సింగ్ కేసులో మిస్టరీ వీడింది. ఫిర్యాదు చేసిన 24 గంటల్లోనే ఆచూకీ పసిగట్టి తల్లిదండ్రుల చెంతకు యువతిని పోలీసులు సురక్షితంగా చేర్చారు. వివరాలను ఎస్‌ఐ ఆంజనేయులు గురువారం వెల్లడించారు. పామిడి మండలం గజరాంపల్లి వద్ద 44వ జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఓ గార్మెంట్స్‌లో పనిచేస్తున్న సదరు యువతి... అక్కడే పనిచేస్తున్న బిహార్‌కు చెందిన యువకుడితో సన్నిహితంగా ఉండేది. ఈ నేపథ్యంలో అతని మాయమాటలతో ఆకర్షితురాలైన ఆమె మంగళవారం సదరు యువకుడితో కలసి వెళ్లిపోయింది. ఘటనపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బుధవారం మిస్సింగ్ కేసు నమోదు చేసిన పెద్దవడుగూరు పోలీసులు.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో కర్ణాటకలోని హాసన్‌లో ఉన్నట్లుగా తెలుసుకుని అక్కడకు చేరుకున్నారు. గురువారం యువతిని పిలుచుకొచ్చి సాయంత్రం తహసీల్దార్ ఉషారాణి సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

కేజీబీవీలో కోతుల హల్‌చల్

కూడేరు: స్థానిక కేజీబీవీలో కోతుల బెడదతో విద్యార్థులు బెంబేలెత్తిపోతున్నారు. గదుల్లోకి చొరబడి ట్రంక్ పెట్టెల్లోని దుస్తులు, ఇతర వస్తువులను లాగి పడేస్తున్నాయి. స్టోర్ గదిలోకి వెళ్లి వంట సామగ్రిని చెల్లాచెదురు చేస్తున్నాయి. తరగతి గదుల్లోకి చేరి బాలికలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. భోజనం సమయంలో తరిమేందుకు ప్రయత్నిస్తే దాడికి యత్నిస్తున్నాయి. అటవీశాఖ అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది కోరుతున్నారు.

ఆత్మహత్య చేసుకుంటానంటూ ఎస్పీకి సెల్ఫీ వీడియో


సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న నారాయణస్వామి

గుత్తి: ఓ అమ్మాయి వేధింపులు తాళలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు గుత్తి మండలం రజాపురం గ్రామానికి చెందిన నారాయణస్వామి గురువారం ఉదయం సెల్ఫీ వీడియో తీసి ఎస్పీ కార్యాలయానికి పోస్టు చేశాడు. డీపీఓ నుంచి సమాచారం అందుకున్న గుత్తి పోలీసులు రైలు పట్టాల వెంబడి విస్తృత తనిఖీలు చేపట్టారు. యువకుడి సెల్‌ఫోన్ పామిడి వద్ద స్విచ్ఛాఫ్ అయినట్లు గుర్తించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ గాలించినా యువకుడి ఆచూకీ లభ్యం కాలేదు. గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

సుడి'గండం'లో ఏరువాక

- 40 రోజులకు గానూ రెండే వర్షపు రోజులు
- 30 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు
- సీజన్ మొదట్లోనే సుదీర్ఘ డ్రైస్పెల్స్ నమోదు
- 15 శాతం సాగుతో పడకేసిన ఖరీఫ్ ఏరువాక



అనంతపురం అగ్రికల్చర్: వరుణదేవా... నీ జాడెక్కడ అంటూ 'అనంత' అన్నదాత ఆకాశం వైపు చూస్తున్నాడు. ఖరీఫ్ ఆరంభమై 40 రోజులవుతున్నా పదును వర్షం పడకపోవడంతో రైతుల పరిస్థితి దారుణంగా మారింది. పంటలు విత్తుకునేందుకు కీలక సమయం దగ్గర పడుతున్న కొద్దీ రైతు ఇంట ఆందోళన వ్యక్తమవుతోంది. ఈనెల 15 వరకు పంటలు విత్తుకునేందుకు మంచి అదనుగా చెబుతున్నారు. ఒకవేళ కొంచెం ఆలస్యమైనా నెలాఖరు వరకు ఇబ్బంది లేదని శాస్త్రవేత్తలు, అధికారులు ప్రకటించారు. కానీ... ప్రస్తుత వాతావరణ పరిస్థితులు చూస్తే తేలికపాటికే పరిమితమవుతున్నాయి. ఒక్క మంచి వర్షం కూడా నమోదు కాలేదు. సీజన్ ఆరంభంలోనే తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఖరీఫ్ ఏరువాక మందగించిపోయింది.

రెండే రెండు రోజులు..

ఆశల నైరుతి ఈ సారి మే 26న ప్రవేశించడంతో అన్నదాత హర్షాతిరేకం వ్యక్తం చేశారు. రుతుపవనాల ప్రవేశానికి ముందు మంచి వర్షాలు నమోదయ్యాయి. నైరుతి వచ్చాక వర్షాలు ఆగిపోయాయి. జూన్ 8, 11 తేదీల్లో మాత్రమే మోస్తరుగా వర్షాలు కురిశాయి. ఆ తర్వాత నెల రోజులు కావస్తున్నా మంచి పదను వర్షం పడలేదు. జూన్ 1 నుంచి నేటి వరకు 40 రోజులకు గానూ కేవలం రెండంటే రెండే రోజులు వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదు కావడం గమనార్హం. దాదాపు 20 మండలాల్లో 30 రోజులు సుదీర్ఘ వర్షపాత విరామాలు (డ్రైస్పెల్స్) నమోదు కావడం వర్షాభావ తీవ్రతకు అద్దం పడుతోంది. జూన్‌లో 61.2 మి.మీ గానూ 21.7 శాతం తక్కువగా 47.9 మి.మీ నమోదైంది. కీలకమైన జూలై అయితే మరీ దారుణంగా ఈ పది రోజుల్లో కేవలం 5.9 మి.మీ వర్షం కురిసింది. ఓవరాల్‌గా చూస్తే... ఈ సీజన్‌లో 76.7 మి.మీ గానూ 30 శాతం తక్కువగా 53.8 మి.మీ వర్షం కురిసింది.

30 మండలాల్లో వర్షాభావం:

శెట్టూరు మండలంలో మాత్రమే ఈనెలలో సాధారణ వర్షపాతం నమోదైంది. ఇక మిగిలిన 30 మండలాల్లో సాధారణం కన్నా చాలా తక్కువగానూ, అందులో రాప్తాడు మండలంలో కనీసం తేలికపాటి కూడా నమోదు కాకపోవడం గమనార్హం. దీంతో ఖరీఫ్ ఏరువాక మందకొడిగా 'సాగు'తోంది. జిల్లా సాధారణ పంటల సాగు విస్తీర్ణం 3.40 లక్షల హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 15 శాతంతో 50 వేల హెక్టార్లలో పంటలు వేశారు. అందులో వేరుశనగ 15 వేల హెక్టార్లు, కంది 12 వేల హెక్టార్లు, పత్తి 7,500 హెక్టార్లు, మొక్కజొన్న 5 వేల హెక్టార్లు, ఆముదం 3,500 హెక్టార్లు... ఇలా చాలా తక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేశారు. అదను దాటిపోతుందనే ఆందోళనతో అక్కడక్కడ కురుస్తున్న తేలికపాటి వర్షాలకు అరతేమలోనే పంటలు వేస్తున్న పరిస్థితి నెలకొంది. పంటలు విత్తుకునేందుకు ఆరుద్రతో పాటు పునర్వసు కార్తెలు మంచి అదనుగా చెబుతున్నారు. ఆరుద్ర ముగిసిపోగా... ప్రస్తుతం పునర్వసు నడుస్తోంది. అది కూడా ఈనెల 20న ముగుస్తుంది. అంతలోపు పంటలు విత్తుకుంటే మంచి పంట దిగుబడులు వస్తాయని రైతుల్లో నమ్మకం ఉన్నా... వర్షం జాడ లేక ఆందోళన నెలకొంది.

వర్షాకాలంలోనూ పెరగని భూగర్భజలం

పేరుకు వర్షాకాలమే అయినా జిల్లాలో అనుకున్న మేరకు భూగర్భజలాలు పెరగ లేదు. జూన్, జూలైలో సాధారణం కన్నా 30 శాతం లోటు వర్షపాతం నమోదు కావడంతో ప్రస్తుతం జిల్లాలో ఉన్న 97 ఫిజోమీటర్ల నుంచి తీసుకున్న గణాంకాల ప్రకారం భూగర్భజలాలు సగటున 11.28 మీటర్లుగా నమోదైంది. 12 మండలాల్లో సగటు కన్నా జలాలు లోతుకు వెళ్లినట్లు గుర్తించారు. ఇందులోనూ యాడికి మండలంలో 25.45 మీటర్లు, శెట్టూరులో 24.87 మీటర్లు, పుట్లూరులో 21.81 మీటర్లుగా నమోదు కావడంతో ఈ మూడింటినీ డేంజర్ జోన్‌లో పెట్టారు. ఇవి కాకుండా కళ్యాణదుర్గం, తాడిపత్రి, డి.హీరేహాళ్, బ్రహ్మసముద్రం, కుందుర్పి, కణేకల్లు, పామిడి, గుమ్మఘట్ట, బెళుగుప్ప మండలాలు నీటి ఒత్తిడికి గురవుతున్నట్లు సమాచారం. ఈ మండలాల్లో నీటి వాడకం అధికంగా ఉన్నందున క్రిటికల్, సెమీక్రిటికల్ జాబితాలో పెట్టారు.

జేసీ ఇలాకాలో దాహం కేకలు


రాస్తారోకో చేస్తున్న పిన్నేపల్లి గ్రామస్తులు

యాడికి: జేసీ ప్రభాకరరెడ్డి ఇలాకాలో తాగునీటి కోసం ప్రజలు విలవిల్లాడుతున్నారు. గుక్కెడు నీరు లభ్యం కాక పోవడంతో దాహం తీరడం లేదని వాపోతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు మరిచి గ్రామాల వైపు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు ఇవ్వండి మహాప్రభో అంటూ తరచూ మహిళలు రోడ్డెక్కి నిరసనలు వ్యక్తం చేస్తున్నా.. అటు ప్రజాప్రతినిధులు కానీ, ఇటు అధికారులు కాని పట్టించుకోకపోవడంతో ఇప్పట్లో తాగునీటి ఇక్కట్లు దూరమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు.

తాజాగా పిన్నేపల్లిలో..

తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికి పంచాయతీ పరిధిలోని పిన్నేపల్లి గ్రామ మహిళలు గురువారం తాగునీటి కోసం రాస్తారోకో చేపట్టారు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నెలల తరబడి తమకు తాగునీరు అందడం లేదని వాపోయారు. పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో చివరకు ఇలా మండల కేంద్రానికి చేరుకుని నిరసన తెలపాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ వెంకటేసు, పంచాయతీ ఇన్‌చార్జ్ ఈఓ శశికళ అక్కడకు చేరుకుని ఆందోళన కారులతో చర్చించారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటామని స్పష్టమైన హామీనివ్వడంతో ఆందోళనను విరమించారు.

ఘర్షణ కేసులో 21 మంది అరెస్ట్

- వివాహేతర సంబంధం కారణంగా వ్యక్తిపై గత సోమవారం దాడి
- ప్రతి దాడిలో ఆస్తుల విధ్వంసం


నిందితులను చూపుతున్న పోలీసులు

రాయదుర్గం: వివాహేతర సంబంధ కారణంగా ఆస్తి విధ్వంసాలకు పాల్పడిన 21 మంది యువకులను అరెస్ట్ చేసినట్లు రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. బొమ్మనహాళ్ మండలం కొలగానహళ్లికి చెందిన అనంతరాజు కొంత కాలంగా అదే మండలం మైలాపురం గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయంగా వివాదం తలెత్తి సోమవారం రాత్రి అనంతరాజుపై దాడి చేశారు. దీంతో కోపోద్రిక్తులైన అనంతరాజు, ఆయన బంధువులు మైలాపురం చేరుకుని లోకేష్, విజయ్ ఇళ్లల్లోకి చొరబడి తలుపులు, టీవీ, రెండు ద్విచక్రవాహనాలు, కారు ధ్వంసం చేయడంతో పాటు పది ట్రాక్టర్ల ఎండు గడ్డికి నిప్పు పెట్టారు. పరిస్థితి అదుపు తప్పడంతో ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు డీఎస్పీ రవిబాబు నేతృత్వంలో ఇరు గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... ఆస్తి నష్టానికి కారకులైన 21 మంది యువకులను గురువారం అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచారు. కాగా, ఇదే కేసులో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనంతరాజును డిశ్చార్జ్ కాగానే అరెస్ట్ చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే అనంతరాజుపై దాడికి కారకులైన మైలాపురం గ్రామానికి చెందిన వారిని అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ నబీరసూల్, బొమ్మనహాళ్ పోలీసులు పాల్గొన్నారు.

నకిలీ బంగారంతో బురిడీ


వివరాలు వెల్లడిస్తున్న ట్రైనీ డీఎస్పీ అష్రఫ్

గుంతకల్లు: నకిలీ బంగారంతో ఫైనాన్స్ కంపెనీలను బురిడీ కొట్టిస్తున్న ముఠా గుట్టు రట్టయింది. ఇందుకు సంబంధించిన వివరాలను కసాపురం పోలీసుస్టేషన్‌లో గురువారం ట్రైనీ డీఎస్పీ అష్రఫ్ ఆలీ వెల్లడించారు. గుంతకల్లు పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన తిమ్మయ్య గారి భార్గవ్‌కుమార్, తెల్ల శివానంద్ బుధవారం 4 బంగారు గాజులు తీసుకుని పట్టణంలోని కరూర్ వైశ్య బ్యాంకులో తాకట్టు పెట్టేందుకు వెళ్లారు. అవి నకిలీవిగా గుర్తించిన బ్యాంకు అప్రైజర్ ద్వారా విషయం తెలుసుకున్న అసిస్టెంట్ మేనేజర్ వెంకటరెడ్డి నిలదీయడంతో వారు ఉడాయించారు. దీనిపై అసిస్టెంట్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కసాపురం ఎస్‌ఐ వెంకటస్వామి వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. గురువారం కసాపురం రోడ్డులోని ఎస్‌బీఐ బజార్ బ్రాంచ్‌లో మరోసారి నకిలీ బంగారం కుదువ పెట్టడానికి భార్గవ్‌కుమార్, శివానంద్ రాగా.. అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఈ క్రమంలోనే మొత్తం ముఠా గుట్టు రట్టయింది.

క్రాంతి కుమార్, వేణుగోపాల్ సూత్రధారులు

నకిలీ బాగోతంలో గుంతకల్లులోని ఫక్కీరప్ప కాలనీకి చెందిన చాగంటి క్రాంతి కుమార్, కమ్మర వేణుగోపాల్ సూత్రధారులుగా తేలింది. బంగారం వ్యాపారం చేసే వీరు 70 శాతం సిల్వర్‌పై 30 శాతం బంగారు కోటింగ్ వేసి ఉంగరాలు, గాజులు తదితర వాటిని తయారు చేసేవారు. స్థానిక మోమినాబాద్‌కు చెందిన జావేద్‌తో నకిలీ బంగారంపై హాల్‌మార్క్ గుర్తు వేయించాక.. ముత్తూట్ ఫైనాన్స్, మణప్పురం, ఇతర ప్రైవేట్ బ్యాంకుల్లో తాకట్టు పెట్టి లక్షలాది రూపాయల రుణం తీసుకున్నట్లు విచారణలో వెల్లడైంది. కర్నూలుకు చెందిన ఎరుకల శ్రీనివాసులు, పులిపాటి నరేంద్ర, మేకల శ్రీనివాసులు, మల్లెమాల నరేష్‌కు కూడా నకిలీ బంగారం తక్కువ రేటుకు అమ్మేవాళ్లని తేలింది. నిందితులు 9 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 39 గ్రాముల నాలుగు బంగారు గాజులు, 13 నకిలీ బంగారు ఉంగరాలు, 5 వెండి ఉంగరాలు, 145 గ్రాముల కాపర్‌వైర్, 15 గ్రాముల వెండి కడియం, 4 వెండి కాళ్ల పట్టీలతోపాటు రూ.4 లక్షలు విలువ చేసే వెయింగ్ మిషన్ (హాల్‌మార్క్ ముద్ర వేసే)తోపాటు రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నట్లు ట్రైనీ డీఎస్పీ వివరించారు. నిందితుల అరెస్టులో ప్రతిభ చూపిన కానిస్టేబుల్స్ జాఫర్, కిషోర్‌కుమార్, ఓబులేసు, మహబుబ్‌బాషా, అశోక్, నజీర్‌లను అభినందించారు.

పలువురిపై కేసు నమోదు

యల్లనూరు: ఘర్షణ కేసులో పలువురిపై కేసు నమోదు చేసినట్లు పుట్లూరు సీఐ సత్యబాబు తెలిపారు. యల్లనూరు మండలం కూచివారిపల్లికి చెందిన జయకృష్ణ తండ్రి నాగేశ్వర్‌పై బొప్పేపల్లికి చెందిన వెంకట్రాముడు గతంలో దాడి చేశాడు. దీంతో కక్ష పెంచుకున్న జయకృష్ణ బుధవారం రాత్రి మద్యం మత్తులో బీరు సీసాతో వెంకట్రాముడిపై దాడి చేశాడు. దీంతో వెంకట్రాముడు తన బంధువులను పిలుచుకుని జయకృష్ణ ఇంట్లో చొరబడి టీవీ, తలుపులు, గేటు, బీరువా, ఫ్రిజ్ తదితర వస్తువులను ధ్వంసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు వెంకట్రాముడితో పాటు మరో 14 మందిపై గురువారం కేసు నమోదు చేశారు.

ట్రోలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అనంతపురం: ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి తీర్పుపై సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్ చేసిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని అనంతపురం బార్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బార్ కౌన్సిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని అన్ని కోర్టుల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించి, నిరసనలో పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట్రాముడు, ట్రెజరర్ వెంకట రఘుకుమార్, సంయుక్త కార్యదర్శి జుబేర్, మాజీ ఉపాధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది బడా నారాయణరెడ్డి, శ్రీకాంత్, అవ్వా సురేష్, ప్రణీత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఆర్థో'లో మృతిపై విచారణ

అనంతపురం మెడికల్: ఈ నెల 9న ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఆర్థో విభాగంలో చోటు చేసుకున్న యువకుడి మృతిపై ఆస్పత్రి అధికారులు విచారణ చేపట్టారు. ఉరవకొండ మండలం నింబగల్లు గ్రామానికి చెందిన రాజేష్ (22) కాలు నొప్పితో బాధపడుతూ తొలుత ఓ ప్రైవేట్ నర్సింగ్ హోంలో, అనంతరం సర్వజనాస్పత్రిలో చికిత్స పొంది మృతి చెందిన అంశంపై 'మేడా'లో అడ్మిషన్.. 'జీజీహెచ్'లో డెత్ శీర్షికన గురువారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం స్పందించారు. మృతిపై విచారణకు ఆదేశించారు. ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మరో ఇద్దరు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌తో కమిటీను ఏర్పాటు చేశారు. మృతి గల కారాణాలపై నివేదిక సమర్పించాలని కోరారు. ఇదిలా ఉండగా స్వయంగా సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం తన సొంత మేడా నర్సింగ్ హోం నుంచి జీజీహెచ్‌కు బదిలీ చేసిన కేసులో రోగి మృతి చెందిన అంశంపై విచారణలో పారదర్శకత లోపించే అవకాశముందనే చర్చ జీజీహెచ్‌లో జోరుగా సాగుతోంది.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

అనంతపురం: నగరంలోని ఓ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు... గుంతకల్లు మండలానికి చెందిన ఓ విద్యార్థిని నగరంలోని అరవిందనగర్‌లోని బీసీ హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. గురువారం ఆమెను కలిసేందుకు వచ్చిన తండ్రి సరిగా చదవడం లేదని మందలించాడు. అయితే అందరి ముందు మందలించడంతో మనస్తాపానికి లోనైన ఆమె తన గదిలోకి వెళ్లి విషపూరిత ద్రావకం తాగింది. తోటి విద్యార్థినిలు గమనించి వెంటనే సర్వజనాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

తహసీల్దార్ల సంతకాల ఫోర్జరీ!

- ఒకే రోజు మూడు మండలాల్లో వెలుగులోకి
- విచారణ జరపాలని పోలీసులకు ఫిర్యాదులు

కళ్యాణదుర్గం: నకిలీ ఈ- స్టాంపుల కుంభకోణంతో రాష్ట్రాన్ని కుదిపేసిన కళ్యాణదుర్గం నియోజకవర్గంలో తాజాగా మండల మేజిస్ట్రేట్‌ల సంతకాల ఫోర్జరీ అంశం కలకలం రేపింది. ఒకరు కాదు ఇద్దరు కాదు... ఏకంగా ముగ్గురు తహసీల్దార్ల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ డాక్యుమెంట్లను సృష్టించిన అంశం ఆలస్యంగా వెలుగు చూసింది. ఫోర్జరీ వ్యవహారంపై పోలీసులకు మూడు మండలాల తహసీల్దార్లు ఫిర్యాదులు చేశారు.

ఆ మూడు మండలాలే కీలకం

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం మండలాల తహసీల్దార్ల సంతకాలు ఫోర్జరీ అయినట్లు ఆయా అధికారులు గుర్తించారు. సంతకాలు ఫోర్జరీ చేసి సృష్టించిన డాక్యుమెంట్లు బయటకు రావడంతో కంగుతిన్న అధికారులు ఈ అక్రమాల వెనుక ఉన్నదెవరనే అంశంపై ఆరా తీసే పనిలో పడ్డారు.

- కంబదూరు మండలం అండేపల్లి గ్రామంలో గ్రామ కంఠానికి చెందిన రెండు సెంట్ల స్థలాన్ని తహసీల్దార్ బాలకిషన్ సంతకం ఫోర్జరీ చేసి ఓ వ్యక్తి పత్రాలు సృష్టించుకున్నాడు.ఈ పత్రాల ఆధారంగా తన పేరున ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు బుధవారం కళ్యాణదుర్గంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాడు. అయితే సదరు వ్యక్తి తెచ్చిన డాక్యుమెంట్లలో తహసీల్దార్ సంతకంలో తేడాలను గుర్తించిన సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి వెంటనే విషయాన్ని తహసీల్దార్ బాలకిషన్‌కు చేరవేశారు. దీంతో కంగుతిన్న బాలకిషన్ వెంటనే తన సంతకం ఫోర్జరీ చేసి డాక్యుమెంట్లు సృష్టించిన వారిపై విచారణ చేయాలంటూ పోలీసులను ఆదేశించారు.
- బ్రహ్మసముద్రం మండలం ముద్దలాపురం గ్రామానికి చెందిన ఓ మహిళా రైతు తన పేరున ఉన్న భూమి తనకు తెలియకుండానే వెబ్‌ల్యాండ్‌లో లేకుండా చేశారంటూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ జరిపిన తహసీల్దార్ సుమతి... తన సంతకం ఫోర్జరీ చేసి నకిలీ డాక్యుమెంట్లతో వెబ్‌ల్యాండ్‌లో ఆ భూమిని మరొకరి పేరుపై మార్చినట్లు గుర్తించారు. ఈ అంశంపై విచారణ చేయాలంటూ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు.
- కళ్యాణదుర్గం మండలంలో ఓ వ్యక్తి తన స్థలంపై బ్యాంకులో రుణం తీసుకునేందుకు భూమి హక్కు పత్రాలు తీసుకుని తహసీల్దార్ భాస్కర్ వద్దకు వచ్చాడు. అయితే సదరు వ్యక్తి వద్ద ఉన్న డాక్యుమెంట్లలో సంతకం ఫోర్జరీ అని తహసీల్దార్ గుర్తించారు. ఈ విషయంపై తహసీల్దార్ సదరు వ్యక్తిని ఆరా తీయగా తనకు ఏమీ తెలియదని డాక్యుమెంట్ రైటర్ వద్దకెళితే ఈ పత్రాలు ఇచ్చాడంటూ సమాధానమిచ్చినట్లు తెలిసింది. దీంతో అప్రమత్తమైన తహసీల్దార్ పట్టణ సీఐ యువరాజ్‌కు ఫిర్యాదు చేశారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి అసలు దోషులను గుర్తించాలని సూచించారు.

రంగంలోకి పోలీసులు

తమ సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన అంశంపై మూడు మండలాల తహసీల్దార్లు ఒకే రోజు చేసిన ఫిర్యాదుతో పోలీసులు రంగంలో దిగారు. డీఎస్పీ రవిబాబు ఆదేశాలతో ఆయా మండలాల సీఐలు, ఎస్‌ఐలు అసలు దోషులను గుర్తించే పనిలో పడ్డారు. ఇప్పటికే కళ్యాణదుర్గం, కంబదూరు మండలాల తహసీల్దార్ల వద్దకెళ్లిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ- స్టాంప్ కుంభకోణం మరువకముందే తహసీల్దార్ల సంతకాల ఫోర్జరీ అంశం వెలుగు చూడడం గమనార్హం. రెండు రోజులుగా ఈ అంశం నియోజకవర్గ కేంద్రంలో హాట్ టాపిక్‌గా మారింది. దీని వెనుక టీడీపీ నేతల హస్తముందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అసలు సూత్రధారులను పట్టుకోవాలి

నా సంతకం కోసం కార్యాలయానికి వచ్చిన వారు అమాయకులు. వారికి ఏమీ తెలియదు. వారిని తప్పుదోవ పట్టించిన అసలు సూత్రధారులను పట్టుకోవాలి. మండల మేజిస్ట్రేట్ హోదాలో ఉన్న తహసీల్దార్ల సంతకాలే ఫోర్జరీ చేస్తున్నారంటే ఇది మామూలు విషయం కాదు. దీనిపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి దోషులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.

– భాస్కర్, తహసీల్దార్, కళ్యాణదుర్గం

విచారణ చేస్తున్నాం

తహసీల్దార్ల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ డాక్యుమెంట్లను తయారు చేసిన వారి ఆచూకీ కోసం గాలిస్తున్నాం. ఇప్పటికే కళ్యాణదుర్గం తహసీల్దార్ సూచించిన సదరు బాధితులతో మాట్లాడి పలు విషయాలను రాబట్టుకున్నాం. నకిలీ డాక్యుమెంట్లు ఎవరు ఇచ్చారు? వారి వెనుక ఉన్న వారు ఎవరు? ఎన్ని డాక్యుమెంట్లు ఇలా ఫోర్జరీ సంతకాలతో తయారు చేశారు అనే కోణంలో విచారణ చేస్తున్నాం. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తాం.

– యువరాజ్, సీఐ, కళ్యాణదుర్గం

క్లుప్తంగా

రాజీమార్గంతో వివాదాల పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.రాజశేఖర్

అనంతపురం: వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వమే రాజీ మార్గమని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎన్.రాజశేఖర్ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయ సేవాసదన్‌లో బ్యాంక్ అధికారులు, ప్రమాద బీమా అధికారులు, చిట్‌ఫండ్ కంపెనీ సంబంధిత అధికారులు, కక్షిదారులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మధ్యవర్తిత్వం ద్వారా ఖర్చు తక్కువ. కాలయాపన లేకుండా రాజీమార్గంతో ఇరు పక్షాలు గెలిచినట్లే అని పేర్కొన్నారు.

పరామర్శ


వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పరామర్శిస్తున్న గువ్వల శ్రీకాంత్ రెడ్డి, సాకే చంద్రశేఖర్

అనంతపురం కార్పొరేషన్: ఈనెల 9న రాత్రి బీకేఎస్ మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై టీడీపీ వర్గీయులు దాడి చేసిన విషయం విదితమే. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అడ్మిషన్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఆ పార్టీ బీకేఎస్ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్ రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ గురువారం పరామర్శించారు. దాడికి భయపడవద్దని.. తాము అండగా ఉంటామని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దాదా ఖలందర్, నగర ఉపాధ్యక్షుడు వినీత్, నాయకులు నాగేంద్ర, సాయిప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్


బహుమతులు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

రాప్తాడు/ఆత్మకూరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా జేసీ శివ్ నారాయణ్ శర్మ హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఫలితాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆత్మకూరు కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ హేమలత మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


మాట్లాడుతున్న హెచ్‌పీసీఎల్ కంపెనీ ప్రతినిధులు

అనంతపురంరూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హిందుస్థాన్ పెట్రోలియమ్ కార్పొరేషన్ లిమిటెడ్ (తాటిచెర్ల) స్టేషన్ మేనేజర్ అభిమన్యుదాస్ అన్నారు. గురువారం హెచ్‌పీసీఎల్ కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో తాటిచెర్ల ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ మేనేజర్ అభిమన్యుదాస్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. అనంతరం పాఠశాలకు తడి, పొడి చెత్త డస్ట్‌బిన్లు, పర్యావరణ హితమైన జూట్ బ్యాగులు, విద్యార్థినుల వ్యక్తిగత పరిశుభ్రతకు ఉపయోగపడే కిట్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ కంపెనీ ప్రతినిధులు నాగార్జునరెడ్డి, భరత్‌నాయక్, ముకుందరాఘవ, సాయిప్రశాంత తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అనంతపురం: నగరంలోని రాణినగర్‌లో పేకాట ఆడుతున్న 9 మందిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1,49,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ఈఎన్‌టీ వార్డులో ఖాళీగా తిరుగుతున్న నర్సింగ్ విద్యార్థినులు

● కొరవడిన పర్యవేక్షణ

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో శిక్షణ నిమిత్తం వచ్చే నర్సింగ్ విద్యార్థులపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. హెడ్‌నర్సుల నిర్లక్ష్యంతో అవసరం లేని ప్రాంతాల్లో పదుల సంఖ్యలో విద్యార్థులను పురమాయిస్తున్నారు. వాస్తవంగా ఎమర్జెన్సీ వార్డు, అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్, ఐసీసీయూ వార్డుల్లో నర్సింగ్ విద్యార్థినులను శిక్షణకు కేటాయించాలి. కానీ ఇక్కడ అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. అవసరం లేని వార్డులు, ఓపీల్లో పదుల సంఖ్యలో నర్సింగ్ విద్యార్థులను కేటాయిస్తున్నారు. నర్సింగ్ విద్యార్థులు పూర్తిస్థాయిలో శిక్షణ తీసుకోకుండా సెల్‌ఫోన్ చూసుకుంటూ కాలయాపన చేస్తున్నారు. అదే రద్దీగా ఉండే ప్రాంతాల్లో వారిని కేటాయిస్తే బాగుంటుందని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు మేల్కొని తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– అనంతపురం మెడికల్:


న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో మహిళా సెక్యూరిటీతో వంట చేయిస్తున్న దృశ్యం

● సెక్యూరిటీతో వంట

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో సెక్యూరిటీ మహిళతో వంట చేయిస్తున్నారు. గత మూడు నెలలుగా వంట మనిషి లేకపోవడంతో పౌష్టికాహార లోపంతో ఉన్న చిన్నారులు ఆకలితో మగ్గిపోయారు. దీనిపై సాక్షిలో 'చిన్నారుల ఆకలి కేకలు' అని వరుస కథనాలు వచ్చాయి. దీనిపై కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. సీరియస్‌గా పరిగణించి వంట మనిషిని ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే సర్వజనాస్పత్రి అధికారులు, డీఎంహెచ్ఓ.. కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. ఇంత వరకు వంట మనిషిని ఏర్పాటు చేయలేదు. ఆస్పత్రిలో అసలే మహిళా సెక్యూరిటీలు అంతంత మాత్రం. వారిని తీసుకొచ్చి ఎన్‌ఆర్‌సీలో వంట పని చేయిస్తున్నారు. ఇప్పటికైనా ఆస్పత్రి అధికారులు మేల్కొంటారో లేదో మరి.

– అనంతపురం మెడికల్:

దోబీల బాధ్యతారాహిత్యం

- జీజీహెచ్‌లో పత్తా లేకుండా పోయిన రెగ్యులర్ దోబీ
- అధికారుల పర్యవేక్షణ కరువు
- క్లాస్ 4 ఉద్యోగులతో ఓటీ దుస్తులను ఉతికించిన వైనం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో దోబీల బాధ్యతారాహిత్యం రోగులకు శాపంగా మారుతోంది. రోగులకు సర్జరీ చేసే సమయంలో వినియోగించిన బెడ్‌షీట్లు, కవర్లు, వైద్యుల ఆప్రాన్లు, టవాళ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో సర్జరీలకు జాప్యం జరుగుతోంది. గత వారం రోజులుగా ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో దయనీయమైన పరిస్థితులు చోటు చేసుకున్నాయి. సమస్యను చిన్నదిగా చూస్తున్న అధికారులకు భవిష్యత్తులో అది తీవ్ర నిర్లక్ష్యంగా మారి రోగులపై ప్రభావం చూపే అవకాశం లేకపోలేదని ఆస్పత్రి వర్గాలంటున్నాయి. చివరకు దోబీ లేకపోవడంతో మెయిన్ ఓటీ, ఎమర్జెన్సీ ఓటీల్లో క్లాస్ 4 ఉద్యోగులతో దుస్తులు ఉతికించాల్సిన పరిస్థితి నెలకొంది.


రక్తపు మరకలు అంటిన కర్టన్ తీసుకుని లోపలికి వెళ్తున్న గర్భిణి

ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వారం రోజులుగా అవస్థలు..

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని సర్జరీ, ఆర్థో, ఈఎన్‌టీ, అనస్తీషియా, గైనిక్, తదితర విభాగాలకు సంబంధించి మొత్తం 24 పెద్ద, చిన్న ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి. రోజూ 40 నుంచి 50 ఆపరేషన్లు వరకు జరుగుతాయి. ఒక రోగికి మూడు నుంచి నాలుగు బెడ్‌షీట్లను మార్చాల్సి వస్తుంది.


ఆప్తమాలజీ ఓటీలో శస్త్రచికిత్సలకు వినియోగించిన దుస్తులను మూట కట్టి పడేసిన దృశ్యం

ఆ లెక్కన రోజూ 200 వరకు దుస్తులను రోజూ ఉతకాలి. ఇక లేబర్, ఆప్తమాలజీ, గైనిక్ విభాగాల్లో సిజేరియన్, సాధారణ ప్రవసం జరిగినప్పుడు అత్యధికంగా బెడ్‌షీట్లు, కవర్లు, టవల్స్, కర్టన్లు ఎప్పటికప్పుడు ఉతికి, స్టెరిలైజేషన్ చేసి రోగులకు తిరిగి వినియోగిస్తారు. ఆస్పత్రిలో ఉండే ఇద్దరు దోబీల్లో (రెగ్యులర్ ఒకరు, కాంట్రాక్ట్ ఒకరు) రెగ్యులర్ దోబీ రామాంజనేయులు నాలుగు రోజులుగా పత్తా లేకుండా పోయాడు. దీంతో వివిధ ఆపరేషన్ థియేటర్లతో శస్త్రచికిత్సలను తక్కువగా చేయాల్సిన పరిస్థితి వచ్చింది. లేబర్ వార్డులోనూ కర్టన్లను మార్చక రెండు నెలలు అవుతోందని అక్కడి సిబ్బందే చెబుతున్నారు. వార్డుల్లో రక్తం మరకలు అయిన కర్టన్‌లను తగులుకుంటూనే గర్భిణులు వెళ్లాల్సి వస్తోంది. ఇలాంటి దారుణమైన పరిస్థితులుంటే ఇన్‌ఫెక్షన్ ఏవిధంగా అదుపులోకి వస్తుందని ఆస్పత్రి వర్గాలంటున్నాయి. సమస్యను తేలిగ్గా తీసుకోవడంతోనే భవిష్యత్తులో నిర్లక్ష్యం పెద్దదిగా మారి రోగుల ప్రాణాలపై ప్రభావం చూపుతుందని కొందరు వైద్యులు వాపోతున్నారు.

భక్తిశ్రద్ధలతో చివరి దర్శనం


పీర్లకు చదివింపులు చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరంలోని ఐదవ రోడ్డులో పెద్ద పీర్ల పండుగ (మొహర్రం) వేడుకల్లో భాగంగా గురువారం చివరి దర్శనం భక్తిశ్రద్ధలతో ముగిసింది. పెనుగొండ బాబయ్య, సయ్యద్ మస్తాన్ వలి, శ్రీకసమూరు ఖాలేషా మస్తాన్‌వలి, శ్రీహజరత్ మౌలాలి పీర్ల చివరి దర్శనం కోసం భక్తులు బారులు తీరి మొక్కులు తీర్చుకున్నారు. మకానం వద్ద చక్కెర చదివింపులు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఎంతో మహిమ గల్గిన పీర్ల దేవతలు ఐదవ రోడ్డుకు వచ్చిన తర్వాత ఎంతో ప్రశాంతత, సామరస్యము అలవడ్డాయన్నారు. ఆ కోవలోనే పెద్ద పీర్ల పండుగ బ్రహ్మోత్సవాలు అందరి సహకారంతో ఘనంగా జరిగినట్లు తెలిపారు. అనంతరం వందలాది మందికి అన్న సంతర్పణ చేశారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) నగర కార్యాలయాన్ని గురువారం స్థానిక ఆర్‌ఎఫ్ రోడ్డు వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఐఎఫ్‌టీయూ నగర అధ్యక్షులు దావీద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ప్రధాన కార్యదర్శి బి. సురేష్ , బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గద్దల నాగభూషణం, మాదిగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు పసులూరు ఓబులేసు, ఓపీడీఆర్ జిల్లా కార్యదర్శి ఉపేంద్ర, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెద్దన్న, న్యాయ సామాజిక వేదిక జిల్లా కార్యదర్శి కుల్లాయప్ప, ఆదినారాయణ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మోదీ 11 సంవత్సరాల పరిపాలనలో కార్మికులపై ఉక్కుపాదం మోపారన్నారు. కార్మిక హక్కులను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ కంపెనీలు, పెట్టుబడిదారులకు,



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

బహుళ జాతి కంపెనీలకు అనుకూలమైన నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు కార్మిక వ్యతిరేక విధానలను అవలంభిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు హరి, విద్యార్థి నిరుద్యోగ సంఘం రాష్ట్ర నాయకులు రామన్న, హమాలీ యూనియన్ నాయకులు లింగమయ్య, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలతో నూతన ఆవిష్కరణలు

- వైద్య కళాశాల ప్రిన్సిపాల్ షారోన్ సోనియా

అనంతపురం మెడికల్: పరిశోధనలతో నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉటుంది. ఆ దిశగా విద్యార్థి దశ నుంచే యూజీ, పీజీ విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా పేర్కొన్నారు. గురువారం వైద్య కళాశాలలో పరిశోధనలకు సంబంధించి పీజీ మొదటి సంవత్సర విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పీజీ విద్యార్థులు వారు చేయబోయే పరిశోధనలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా రీసెర్చ్ ఎథిక్, సైంటిఫిక్, థీసిస్ కమిటీలకు తెలియజేశారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, చిత్రంలో ఎథిక్స్ కమిటీ సభ్యులు

ప్రిన్సిపాల్ సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తెలుగు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ షంషాద్ బేగం, డాక్టర్ శంకర్, ప్రొఫెసర్లు డాక్టర్ శాంతిరెడ్డి, డాక్టర్ సురళీ, కమిటీ సభ్యులు డాక్టర్ ప్రేమ్ కుమార్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ ఆశాలత, డాక్టర్ పద్మ శ్రావణి, డాక్టర్ శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

ఏడీసీసీ బ్యాంకు అభివృద్ధికి కృషి

అనంతపురం సెంట్రల్: ఏడీసీసీ బ్యాంకు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నూతన చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి గురువారం బ్రాంచ్ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. 2025–26 సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా డిపాజిట్ల సేకరణ, రుణ వితరణ, రుణ వసూళ్ల, లీగల్ కవరేజ్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సీఈఓ సురేఖరాణి, ఆప్కాబ్ నోడల్ అధికారి సురేంద్ర, డీజీఎం రాంప్రసాద్, సుఖదేవ్ బాబు, విజయ్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు ఆర్థిక పురోగతి సాధించాలి

అనంతపురం అగ్రికల్చర్: అధీకృత రిజర్వాయర్లకు ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేయడానికి వీలుగా ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభించామని ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ (ఎఫ్‌డీవోలు) అసిఫ్, లక్ష్మీనారాయణ, బాబునాయక్ తెలిపారు. గురువారం స్థానిక మత్స్యశాఖ డీడీ కార్యాలయ ఆవరణలో మత్స్యకార సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన జాతీయ మత్స్యకార దినోత్సవంలో ఎఫ్‌డీవోలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు. చేపల పెంపకం, చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి ప్రభుత్వం ఆదేశాల మేరకు మత్స్యశాఖ ద్వారా పథకాలు అమలు చేస్తామన్నారు. అందులో భాగంగా లైసెన్స్‌డ్ రిజర్వాయర్లకు ఉచితంగా, మిగిలిన చెరువులు, సొసైటీ సభ్యులకు రాయితీతో చేప పిల్లల పంపిణీ చేస్తామన్నారు. అలాగే రాయితీతో


మాట్లాడుతున్న ఎఫ్‌డీఎం అసిఫ్

వలలు, బోట్లు, ద్విచక్ర వాహనాలు, సైకిళ్లు కూడా పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రస్తుతం అధీకృత రిజర్వాయర్లలో చేపల వేట నిషేధం అమలులో ఉన్నందున సహకరించాలని కోరారు. ఆక్వారంగం అభివృద్ధి చెందుతున్నందున మత్స్యకారులు ఆర్థిక పురోగతి సాధించాలని సూచించారు.

కమనీయం.. నారాయణుడి కల్యాణం

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలోని పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థనారాయణస్వామి క్షేత్రంలో గురువారం స్వామివారి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు సుదీర్‌కుమార్ శర్మ, బాలసుబ్రమణ్యశర్మ, సునీల్ కుమార్ శర్మలు శ్రీదేవి, భూదేవి సమేత నారాయణ స్వామిని పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం పెళ్లి మండపంలో స్వామివారి కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున విచ్చేన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈఓ


ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

సుబ్రహ్మణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేడుకగా శ్రీనివాసుడి కల్యాణం


పూజలు చేస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: హెచ్చెల్సీ కాలనీలోని వలీస్వామి ఆశ్రమ ప్రాంగణంలో గురువారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఆశ్రమ ప్రతినిధి దేవనూరు విజయ్‌కుమార్ నేతృత్వంలో సాయంత్రం నుంచి రాత్రి వరకు శ్రీవారి నామ సంకీర్తనల నడుమ శ్రీవారి పరిణయ మహోత్సవాన్ని ఆధ్యాత్మికవేత్తలు మణూరు నాగరాజు దంపతులు సంధానకర్తలుగా శాస్త్రోక్తంగా జరిపించారు. మాంగళ్యధారణ, తలంబ్రాలు, ఎదుర్కోలు వంటి సంప్రదాయ ఘట్టాలు ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులతో కలిసి ఆషాఢ పౌర్ణమి దీపాన్ని వెలిగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆషాఢ పౌర్ణమి దీపార్చన వేడుకల విశిష్టతను తెలియజేశారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది.

అన్నదానం


భోజనం వడ్డిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: హజరత్ సయ్యద్ మస్తాన్ వలి జియారత్ సందర్భంగా గురువారం రాత్రి 43వ డివిజన్ కార్పొరేటర్ ఇసాక్ మదిని ఆధ్వర్యంలో మేయర్ వసీం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా కమ్యూనిటీ సభ్యులు జియారత్ కార్యక్రమాన్ని కులమతాలకు అతీతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కమల్ భూషణ్, ధనుబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వ్యాస మహర్షి జయంతి

అనంతపురం టవర్‌క్లాక్: స్థానిక గంగ పుత్ర కళ్యాణ మంటపంలో గురువారం వ్యాస మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ మాట్లాడుతూ.. వేదవ్యాసుడు పౌర్ణమి రోజు జన్మించడంతో వ్యాస పౌర్ణమి లేక వ్యాస జయంతిగా జరుపుకుంటామన్నారు. మహాభారత ఇతిహాసలను అపహాస్యం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో చంద్రబాబు, నాగేంద్ర, గంగప్ప, జశ్వంత్, రమేష్, నారాయణస్వామి, గంగాధర్, శ్రీనివాసులు, శేషాద్రి, వెంకటేష్, పాపన్న, ఎర్రిస్వామి, జయశంకర్, శ్రీనివాసులు, శంకర్, యశోద, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి


సమస్యలను వివరిస్తున్న ఎంయూ డివిజన్ కార్యదర్శి విజయ్‌కుమార్

గుంతకల్లు: రైల్వే ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కార్మికులు, ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ కోరారు. గురువారం గుంతకల్లు రైల్వే ఆస్పత్రికి విచ్చేసిన దక్షిణ మధ్య రైల్వే చీఫ్ మెడికల్ డైరెక్టర్ నిర్మాల రాజరాంకు మెడికల్ బ్రాంచ్ సెక్రటరీ రమేష్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే ఆస్పత్రిలో ముఖ్యమైన సర్జన్, గైనకాలజిస్ట్ డాక్టర్లతోపాటు 7 నర్సింగ్ స్టాఫ్‌లు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఖాళీగా ఉన్న ఫార్మిసిస్ట్, ల్యాబ్ టెక్నిషియన్, ఈసీజీ టెక్నిషియన్ పోస్టులు భర్తీకి నోచుకోలేదన్నారు. ఇక్కడి నుంచి అనంతపురం, కర్నూలులోని కార్పొరేట్ ఆస్పత్రులకు రైల్వే ఉద్యోగులను మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేస్తున్నట్లు తెలిపారు. గుంతకల్లు పట్టణానికి సమీపంలో ఉన్న బళ్లారి సిటీలోని కార్పొరేట్ ఆస్పత్రికి రెఫరల్ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అంతకముందు సీఎండీ నిర్మాల రాజరాం రైల్వే ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఓపీ విభాగాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.

'నాటు కోళ్ల షెడ్డును కాపాడండి'

అనంతపురం: 'వ్యవసాయ పొలంలో నాటు కోళ్ల పెంపకానికి షెడ్డు ఏర్పాటు చేసుకున్నాం. రాత్రి పూట దొంగలు వచ్చి నాటు కోళ్లను అపహరిస్తున్నారు' అని రిటైర్డ్ ఏఈఓ జయరాముడు గురువారం నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నారాయణపురం నుంచి నరసనాయుని కుంటకు వెళ్లే దారిలో వ్యవసాయ పొలంలో ఇంటితో పాటు కోళ్ల పెంపకానికి ఒక షెడ్డు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. షెడ్డుకు కాంపౌండ్ వాల్ ఉన్నప్పటికీ రాత్రిపూట ఓ దొంగ 5 నాటు కోళ్లను ఎత్తుకెళ్లాడని పేర్కొన్నారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్లు తెలిపారు. దొంగల బారి నుంచి కాపాడాలని పోలీసులను కోరారు.

ఓం సాయి.. శ్రీసాయి


రామచంద్ర నగర్‌లో భక్తులకు అన్నదానం


ఆత్మకూరు: సాయిబాబా ఆలయంలో పూజలు


మూడవ రోడ్డులో పూజలు చేస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్/రాప్తాడు/ఆత్మకూరు: అనంతపురం, రాప్తాడు నియోజకవర్గాల్లో గురువారం వాడవాడలా గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. లోకానికి జ్ఞానమూర్తిగా పూజలందుకుంటున్న సాయినాథుడి దర్శనంతో భక్తులు పులకించిపోయారు. 'ఓం సాయి శ్రీ సాయి' నామస్మరణతో మందిరాలు మార్మోగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు జరిగాయి. పలుచోట్ల పల్లకీ సేవలు, గ్రామోత్సవాలు, బాబాకు చందన సేవలు నేత్రపర్వంగా సాగాయి. వేలాది మందికి అన్న ప్రసాద వితరణ జరిగింది.


రామచంద్ర నగర్‌లో కొలువుదీరిన సాయిబాబా


చెరువు కట్టపై వెలిసిన మందిరంలో పూజలందుకున్న సాయినాథుడు